కథ

# పాపం...బ్రహ్మయ్య

-అవధానుల సుధాకరరావు

''సరే! ఇహ మీరెళ్ళొచ్చు...'' ఫైల్లోంచి తలెత్తకుండానే చెప్పాడు ఆఫీసర్ - గొప్ప ఉదారస్తుడిలా, కనికరిస్తున్నట్లు ఫోజు పెడుతూ. అప్పుడు సమయం రాత్రి తొమ్మిదిన్నరవుతోంది.

బ్రహ్మయ్య బ్రతుకుజీవుడా... అనుకుంటూ, బరువైన ఫైళ్ళు చంకలో పెట్టుకొని, రెండంతస్థుల మెట్లు దిగి, తన 'సెక్షన్'కి వచ్చాడు.

పొద్దునెప్పుడో నోట్లో నాలుగు మెతుకులేసుకున్నాడు. 'కేంటీన్'లో టిఫిన్లు చౌకధరకే దొరుకుతాయి. కాని, తన ఆర్థిక పరిస్థితి అనుమతించొద్దూ...? వేసవికాలంలోని జలాశయాలూ, లోతుకుపోయిన కడుపు - కాస్త మా అతీ గతీ పట్టించుకో మహానుభావా... అని దీనంగా నివేదించుకుంటున్నట్లుగా ఉంది. అలవాటుతో ఆకలిని సునాయాసంగా భరించగలడు కాని, నిద్ర కాగడం తన వల్లకాదు. అప్పుడే కళ్ళు మండటం మొదలయింది. బడలికతో ఒళ్ళు హూనమయింది.

ఇప్పుడు... ఈ అర్ధరాత్రివేళ బస్సుల్లో బయల్దేరి, ఇరవై కిలోమీటర్ల దూరంలో వున్న కొంపకి చేరడమెలాగో? ఎన్ని అవస్థలు పడాలో??

వనస్థలిపురం. ఆ పేరు పెట్టిన పుణ్యాత్ముడెవరో గాని - భలే దూరదృష్టి ఉన్నవాడే! అనుభవించండ్రా వెధవల్లారా! మీ చావు మీరు చావండి... ఇక్కడ నివాసస్థలం కంటే, వనవాసమే 'బెటర'నిపించే అవస్థల్ని మీరు ఎదుర్కొనవలసి ఉంటుంది... అని సూచిస్తూ, తమ కాలనీకి ఆ పేరు పెట్టి ఉంటారేమో!

''సార్! అయ్యగారు పిలుస్తున్నారు...'' ప్యూన్ చెప్పింది చావుకబురే బ్రహ్మయ్యకి. అసలే తనకి మోకాళ్ళ నొప్పులు. ఇప్పుడు మళ్ళీ అన్ని మెట్లెక్కి పైకి వెళ్ళాలంటే తనవల్ల అయ్యే పనేనా? ఈ అవస్థ కంటే ముక్కుమూసుకుని, మురికి 'మూసీ'లో దూకడం మేలనిపిస్తోంది.

తాత, తండ్రుల్ని తల్చుకుంటూ మళ్ళీ మెట్లన్నీ ఎక్కి, పైకి వెళ్ళాడు.

అంత క్రితమే 'ఒబెరాయ్'లో పార్టీకి వెళ్ళొచ్చిన ఆఫీసర్ 'రివాల్వింగ్ ఛైర్'లో విలాసంగా కూర్చుని, బాన కడుపుని ఆప్యాయంగా నిమురుకుంటూ... మిఠాయి కిళ్ళీ నములుతూ, పరమానందంగా ఉన్నాడు.

''ఏం లేదండీ! రేపుదయం ఎనిమిదిన్నరకల్లా మీరిక్కడ ఉండి తీరాలి. ఆ విషయం మర్చిపోతారేమో, మరోసారి గుర్తుచేద్దామని రమ్మన్నాను...'' అన్నాడు. బ్రహ్మయ్యకి చెప్పలేనంత కోపం వచ్చింది.

'ఎలా మర్చిపోతాన్రా ముదనష్టప్పెనుగా! వారం రోజులుగా సాగుతున్న ఈ హడావుడితో నా దుంప తెంచుతున్నావు కదరా! సమయానికి తిండి, తిప్పల్లేకుండా, నిమ్మళంగా ఒకచోట కూర్చోనివ్వకుండా, స్థిమితంగా ఊపిరి పీల్చుకోనివ్వకుండా, అడ్డమైన గొడ్డుచాకిరి చేయిస్తున్నావు కదరా...' అని తిట్టుకున్నాడు.

వాషింగ్టన్ నుంచి వరల్డ్ బ్యాంక్ ప్రతినిధుల బృందం వస్తోన్న కారణంగా - ఆఫీసు వర్కు వరదలా చుట్టుముట్టి, హెడ్‌గుమస్తా అయిన బ్రహ్మయ్యని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

రాత్రి పదకొండు గంటలకి క్షతగాత్రుడిలా - ఈసురోమంటూ, ముక్కుతూ, మూలుగుతూ ఇల్లు చేరుకున్నాడు బ్రహ్మయ్య.

బట్టలు విప్పబోతుంటే, హఠాత్తుగా కరెంటు పోయి గాఢాంధకారం ఆవరించుకుంది. ఆ మరుక్షణమే చెవిలో దోమల సంగీత కచేరీ మొదలయింది.

''జానకీ! స్నానం చేస్తానోయ్! నీళ్ళున్నాయా?''


''లేకేం? గండిపేట నిండి, పంపుల్లోంచి నీళ్ళు ఫుల్లుగా, ప్రవాహంలా దూకుతున్నాయి. ఎన్ని గంగాళాలు కావాలి తవరి స్నానానికి?'' ఎకసెక్కంగా ఎదురుప్రశ్న విన్పించింది భార్య గొంతులోంచి.

చెమటకంపు కొట్టే శరీరాన్ని కొద్దిపాటి నీటితో ప్రక్షాళన చేసుకున్నాడు బ్రహ్మయ్య.

''ఉత్తరాలేమయినా వచ్చాయా?'' అలవాటు ప్రకారం అడిగేడు, భోజనాని కూర్చుంటూ...

''ఆ! మీ వంశోద్ధారకుడు రాసాడు...''

''వంశీయా! ఏం రాసాడోయ్?'' మనసులో చావని ఆశ అతడిచేత ఆ ప్రశ్నడిగించింది. బదులుగా ఆమె - భళ్ళున కంచంలో చారు గుమ్మరించింది. బ్రహ్మయ్యకి చూచాయగా విషయం అర్థమైపోయింది. మక్కువగా ములక్కాడ నవుల్తూ, ప్రేమగా భార్య ముఖంలోకి చూస్తూ అన్నాడు ''వారంలో ఐదార్రోజులు ఉపవాసాలంటూ ఆరోగ్యం చెడగొట్టుకోకు జానకీ...''



''రోజుకి ముప్పొద్దులా మెక్కడానికి - మనింట్లో ధాన్యపు రాసులు మూలుగుతున్నాయా...?''

''మజ్జిగ...'' అన్నాడు బ్రహ్మయ్య, మొహం క్రిందకు వాల్చుకుని.

మీగడ పెరుగంటే బ్రహ్మయ్య కెంతిష్టమో! ఎన్నేళ్ళయిందో ఆ అనుభవం పొంది. పల్చటి, నీళ్ళ మజ్జిగతో అయిష్టంగానే కంచం ఖాళీచేసి, లేచి చెయ్యి కడుక్కున్నాడు.

వక్కపలుకు నవుల్తూ, కొడుకు రాసిన ఉత్తరం అందుకొని, కొవ్వొత్తి వెలుగు క్రిందకు చేరాడు.

''నాన్నా! చెల్లెలి పెళ్ళి గురించి రాసావు. మంచిదే. చేసెయ్యి. దానికా వయసు కూడా వచ్చింది. నేనా 'టైం'కి వచ్చి నాలుగక్షింతలు మాత్రం వెయ్యగలను. మరే విధమైన సహాయం నానుంచి ఆశించి, ఆ తర్వాత బాధపడొద్దు. నేను 'పార్ట్‌నర్'ని వెదుక్కునే ప్రయత్నంలో ఉన్నాను. ఎంప్లాయిడ్ గర్ల్ అయితే చాలు. తదితర విషయాలకి ప్రాధాన్యమివ్వదల్చుకోలేదు. మీ ఆమోదం కేవలం లాంఛనప్రాయమే. తల్లిదండ్రులు బ్రతికి ఉన్నారు కాబట్టి - అక్కడ మీ హాజరీ మాత్రం ఉంటే చాలు.

చెల్లి పెళ్ళికి ఏదో ఒక గిఫ్టు మాత్రం పట్టుకొస్తాను.

ఇట్లు - మీ సుపుత్రుడు''

ఉత్తరం పూర్తి చేసిన బ్రహ్మయ్యకి చేదు ముద్దని ఎవరో గొంతులోకి తోసినట్లనిపించింది. సంపాదనాపరులయ్యాక పిల్లల స్వభావాలు ఇంతగా మారుతయ్యా? అన్పించింది బ్రహ్మయ్యకి.

ఉద్యోగంలో జాయినవడానికి వెళ్తూ, వంశీ చెప్పిన మాటలు ఇప్పటికీ చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి.

''నాన్నా! ఇక మనకే కష్టాలుండవు. నాకు నెల జీతం ఏడువేలొస్తుంది. నీకు కనీసం ఐదువేలన్నా పంపిస్తుంటాను.

చెల్లెలికి మంచి సంబంధం చూడు. కట్న కానుకలు ఘనంగా ఇచ్చి రంగరంగ వైభవంగా దాని పెళ్ళి చేద్దాం. ఇంతకాలం నువ్వు, అమ్మ మా కోసం ఎంతగానో కష్టపడ్డారు. ఇక నుంచి మిమ్మల్ని పువ్వుల్లో పెట్టి చూసుకుంటాను. సుఖ సంతోషాల్లో మిమ్మల్ని ముంచెత్తుతాను...''

మూణ్ణెల్లు కాలేదు. నీ వాగ్దానాలన్నీ, ఏ గాలికి కొట్టుకుపోయినయిరా, నా ముద్దుల కొడకా! బ్రహ్మయ్య పితృ హృదయంలో బాధా తరంగాలు అల్లకల్లోలంగా చెలరేగుతున్నాయి. ఏ తండ్రయినా - ఎదిగొచ్చిన కొడుకంటే, ఏనుగంత బలంగా భావిస్తాడు. కాని, ఈ కాలం పిల్లల తత్వాలు చూస్తుంటే అదెంత తప్పో తెలుస్తోంది. ఓ ఆడపిల్ల తండ్రిగా తన బాధ్యత కంటే - కొడుకుని ఉన్నతస్థాయికి తీసుకెళ్ళాలని ఎక్కువగా తాపత్రయపడి, అప్పులు చేసి, శక్తికి మించిన ఖర్చుని నెత్తికెత్తుకొని - చివరికిప్పుడు నిస్సహాయంగా నిలబడ్డాడు. మనసులో వేదన, అశాంతికి తోడు - పవర్‌కట్ వల్ల సరిగా నిద్రపోలేక పోయాడు.

ఎప్పుడో తెల్లవారుఝాము ప్రాంతంలో కాస్త మంచి కునుకు పట్టింది.

మళ్ళీ మెలకువొచ్చేసరికి రేడియోలో తెలుగు వార్తలొస్తున్నాయి.

ఆఫీసర్‌గారి హెచ్చరిక గుర్తుకొచ్చింది. గాభరాగా ఒక్క ఉదుటున మంచం దిగి, ఆదరాబాదరాగా కార్యక్రమాలు ముగించుకున్నాడు. తెల్లవారి లేస్తూనే టెన్షన్... ఛీ... ఏం గుమస్తా బ్రతుకురా దేవుడా!

''జానకీ... కాఫీ ఇస్తావా?''



''పాలవాడు రాలేదు...''

బ్రహ్మయ్యకి నిరాశ, చిరాకు ఏకకాలంలో కలిగేయి. మొహం కడగటంతోనే గొంతులో స్ట్రాంగ్ కాఫీ పడాలి. ఏం చేస్తాం? ఇవ్వాళ్టికి ఇంతే ప్రాప్తం... అనుకుంటూ ఇంట్లోంచి బయటపడ్డాడు.

అల్పపీడనం కారణంగా వాతావరణం మారింది. సన్నగా చినుకులు రాలుతున్నాయి. చల్లదనం ఒంటిని వొణికిస్తోంది. ప్రజలందరూ అపురూపమైన ఆదివారాన్ని ఇళ్ళలో వుండి, విశ్రాంతి ననుభవిస్తూ ఉండడంవల్ల రోడ్లన్నీ ఖాళీగా ఉన్నాయి. బస్సు కూడా ఖాళీగానే ఉండడంతో, బ్రహ్మయ్యకి ఇష్టమైన కిటికీ పక్క సీటు దొరికింది. వీధులన్నీ కటౌట్లు, బేనర్లు, జెండాలతో రాజకీయ కళని సంతరించుకున్నాయి.

గోడల మీద పోస్టర్లు కూడా విరివిగానే కన్పించాయి.

'నూతన ప్రభుత్వం వందరోజుల పాలన' సందర్భంగా అంతు పొంతులేని ఆర్భాటం అది. ప్రక్క సీటతని దగ్గర పేపర్ అడిగి తీసుకొని ముఖ్యమైన వార్తల హెడ్‌లైన్స్ చూసాడు బ్రహ్మయ్య. 'ప్రజల సంక్షేమానికై ప్రధాని కంకణం...' ఫ్రంట్ పేజీలో వార్త అది.

'గ్యాస్ ధర పెంపు... సిగరెట్లపై సుంకం హెచ్చింపు... కాఫీపొడి మరింత ప్రియం...' ఇవి లోపలి పేజీల్లోని వార్తలు...

సిటీ స్పెషల్ ఎడిషన్‌లో మరో వార్త - 'ఉద్యోగుల బస్‌పాస్ రద్దుకై ఆర్టీసీ ప్రతిపాదనలు...' ఈ వార్తలన్నీ తనలాంటి సగటు, మధ్యతరగతి ఉద్యోగస్తుడి నడ్డి విరగ్గొట్టేవే! ఏ పార్టీ అధికారంలో కొచ్చినా ఇదే తంతు! సామాన్యుడి వెతలు షరా మామూలే!

చివరి పేజీ నిండా ప్రభుత్వ ప్రకటన - 'వినూత్న పథకాల రూపకల్పనతో ప్రజల సేవకి ప్రభుత్వం పునరంకితం...' బ్రహ్మయ్య పేపర్ తిరిగిచ్చేశాడు.

ఆఫీసుకి చేరుకునేసరికి ఎనిమిదీ నలభై. కేవలం పది నిముషాలే లేటు. ఫర్లేదనుకున్నాడు. ఆఫీసరు అంతకు ఐదు నిముషాల ముందే ఆఫీసుకి చేరుకున్నాడు. తన ముందు నిలబడ్డ బ్రహ్మయ్యని చూసి ''ఏమిటండీ ఇది! ఏళ్ళు రాగానే సరా? ఉద్యోగం మీద శ్రద్ధ లేకపోతే ఎలా?'' అంటూ విరుచుకుపడ్డాడు. బ్రహ్మయ్య బిత్తరపోయాడు. ఏం సమాధానం చెప్పాలో తోచలేదు.

''నాకు డిసిప్లిన్ అంటే ప్రాణం. పంక్చువాలిటీకి నేను ఫస్టు ప్రిఫరెన్సిస్తాను.

డ్యూటీని నిర్లక్ష్యంచేసే వాళ్ళని క్షమించేది లేదు.

ఒకటికి రెండుసార్లు నేను హెచ్చరించినా - మీరు నిదానంగా, మీ వీలు ప్రకారం ఆఫీసుకొచ్చారు. అందుకు పనిష్మెంట్‌గా ఒక ఇంక్రిమెంట్ స్టాప్ చేస్తున్నాను. ఇక మీరెళ్ళొచ్చు...''

'పాపం... బ్రహ్మయ్య!' నిస్సహాయంగా వెనుదిరిగాడు. మెతకమనిషి... నోరులేని మూగజీవి. అందుకే, అతనంటే అందరికీ అలుసే!